## క్లుప్తంగా

### వాల్‌పోస్టర్ల విడుదల



వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న సభ్యులు

**కోవెలకుంట్ల:** మండలంలోని వల్లంపాడు, చిన్న కొప్పెర్ల, పెద్దకొప్పెర్ల గ్రామాల్లో సిద్ధేశ్వరం అలుగు సాధన బహిరంగ సభ వాల్‌పోస్టర్లను ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా రిటైర్డ్ లైబ్రేరియన్ పల్లె నరసింహారెడ్డి మాట్లాడుతూ.. సిద్ధేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన 9వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 31వ తేదీ సంగమేశ్వరం వద్ద ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రకృతి పీఠం సభ్యులు ఏరాశి మహేశ్వరరెడ్డి, శివ, కేశవ, తదితరులు పాల్గొన్నారు.

### వక్ఫ్ చట్ట సవరణకు వ్యతిరేకంగా నిరసన



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న ముస్లింలు

**కోవెలకుంట్ల:** వక్ఫ్‌బోర్డు చట్ట సవరణను వ్యతిరేకిస్తూ ఆదివారం పట్టణంలోని ముస్లింలు నిరసన తెలిపారు. స్థానిక గ్రామ పంచాయతీ సర్కిల్‌లో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మత పెద్దలు యాసిన్ మౌలానా, అబ్దుల్ సలాం మౌలానా, మండల ఉపాధ్యక్షురాలు షాజహాన్, గఫూర్ మాట్లాడుతూ.. కేంద్రం తీసుకున్న నిర్ణయంతో వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు భంగం కలుగుతుందన్నారు. సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

### ఘనంగా శివపార్వతుల కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

**బనగానపల్లె రూరల్:** యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో మాస శివరాత్రి సందర్భంగా ఆదివారం శివపార్వతుల కల్యాణం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం ఆలయ ఈఓ చంద్రుడు, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ఉమామహేశ్వరులకు అభిషేకం, అర్చన తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలకు సుందరంగా ముస్తాబు చేసి శాస్త్రోక్తంగా కల్యాణం చేశారు.

### చౌడేశ్వరిదేవి ఆలయాభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న దాత

**బనగానపల్లె రూరల్:** మండలంలోని నందవరం చౌడేశ్వరిదేవి ఆలయాభివృద్ధికి ఇదే గ్రామానికి చెందిన తూర్పునాటి అంకాలు కుమారుడు తూర్పునాటి అశోక్ కుటుంబ సభ్యులు ఆదివారం రూ.25వేల విరాళాన్ని అందజేసినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు దాతను సన్మానించి అమ్మవారి ప్రసాదం అందజేశారు.

### వైద్య శిబిరానికి స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

**సంజామల:** మండల పరిధిలోని మంగపల్లె గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. పెద్దిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన సుమారు 800 మందికి గుండె, ఊపిరితిత్తులు, షుగర్, బీపీ, కంటి, చర్మం, కిడ్నీ తదితర సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. నిర్వాహకులు పెద్దిరెడ్డి షేక్షావలీరెడ్డి, మౌలాలిరెడ్డి పర్యవేక్షించారు.

### ప్రమాదంలో స్కూటరిస్టుకు గాయాలు

**బేతంచెర్ల:** మండల పరిధిలోని ముద్దవరం కాశిరెడ్డి నాయన ఆశ్రమం వద్ద ఆదివారం ద్విచక్రవాహనం ప్రమాదవశాత్తు బోల్తాపడి వ్యక్తి గాయపడ్డాడు. వివరాలు.. వెల్దుర్తి మండలం లక్ష్మీనగరం గ్రామానికి చెందిన మహేష్ ద్విచక్రవాహనంపై బేతంచెర్లకు వస్తుండగా అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో మహేష్‌కు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం బేతంచెర్ల సీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో కర్నూలుకు తరలించారు.

## సండే సందడి



నెహ్రూనగర్ పార్కులో వీల్‌చైర్‌లో చిన్నారులు



కేవీఎస్ పార్కులో ఉయ్యాల ఊగుతూ..



నగరవనంలో బ్యాలెన్స్ వీల్ ఆడుతూ..



నగరవనంలో ఆనందంగా గడుపుతున్న చిన్నారులు




పోలీస్ క్రికెట్ గ్రౌండ్‌లో నెట్‌ప్రాక్టీస్ చేస్తున్న బాలురు

ఈ ఏడాది రుతుపవనాలు ముందుగా రావడం, వారం రోజుల నుంచి రాత్రి సమయాల్లో వర్షాలు కురుస్తుండడంతో వాతావరణం చల్లబడింది. భానుడి భగభగల నుంచి ఉపశమనం లభించింది. దీంతో చిన్నారులు డోన్ మున్సిపల్ పరిధిలోని పార్కులతో పాటు మండలంలోని ఎర్రగుంట్ల రహదారిలో ఉన్న నగరవనంలో సందడి చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మున్సిపల్ పరిధిలో ఏడు పార్కులు, రూ.6 కోట్లతో నగరవనాన్ని ఏర్పాటు చేశారు. వేసవి సెలవులు ముగింపు దశకు రావడంతో చిన్నారులు, విద్యార్థులు ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం పార్కుల్లో ఆటలు ఆడేందుకు సమయాన్ని కేటాయిస్తున్నారు. దీంతో నగరవనంతో పాటు అన్ని పార్కుల్లో సందడి వాతావరణం నెలకొంది. సండే రోజుల్లో జనంతో కిటకిటలాడుతున్నాయి. **–డోన్**

### వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

**సంజామల:** మండలంలో వ్యవసాయానికి సోమవారం నుంచి ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఇన్‌చార్జ్ ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. సంజామల, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం సబ్‌స్టేషన్‌ల పరిధిలోని ముక్కమల్ల, ఆల్వకొండ, రెడ్డిపల్లె, వసంతాపురం, కమలపూరి, ముదిగేడు, కానాల, అక్కంపల్లె, గిద్దలూరు, ఆర్.లింగందిన్నె, రామిరెడ్డిపల్లె, మిక్కినేనిపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఈ సమయాల్లో విద్యుత్ సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

### తహసీల్దార్ బదిలీ

**కొలిమిగుండ్ల:** సాధారణ బదిలీల్లో భాగంగా కొలిమిగుండ్ల తహసీల్దార్ బాల ఈశ్వరరెడ్డి విజయవాడ సీసీఎల్‌కు బదిలీ అయ్యారు. ఆయన గతంలో అక్కడి నుంచే ఇక్కడికి తహసీల్దార్‌గా వచ్చారు. బదిలీ అయిన స్థానంలో ఎవరూ రాకపోవడంతో డిప్యూటీ తహసీల్దార్ విశ్వతేజకు ఉన్నతాధికారులు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

## సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

**డోన్ టౌన్:** భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును ప్రభుత్వం పునరుద్ధరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్న రహిమాన్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వస్తే సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తామని ఎన్నికల సమయంలో కూటమి నేతలు చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారన్నారు. అయితే అధికారంలోకి వచ్చి 11 నెలలు పూర్తి కావచ్చినా ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నించారు. అన్ని రాష్ట్రాల్లో కార్మిక సంక్షేమ బోర్డులు ఉన్నాయని.. ఏపీలో మాత్రమే లేకపోవడం బాధాకరం అన్నారు. 50 ఏళ్లు నిండిన భవన నిర్మాణ కార్మికులకు పెన్షన్ ఇవ్వాలన్నారు. మెరుగైన వైద్యం, విద్య, సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. సమావేశంలో గౌండా ఖాశీం, కిట్టు, ఖాజా హుసేన్, గౌస్ పాల్గొన్నారు.

### వైఎస్సార్‌సీపీకి విధేయునిగా పనిచేస్తా



కుసుకుంట్ల రామన్న

**అవుకు:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఎప్పటికీ విధేయుడిగా పనిచేస్తానని ఆ పార్టీ స్టేట్ పబ్లిసిటీ వింగ్ సెక్రటరీగా ఎన్నికైన కుసుకుంట్ల రామన్న ఆదివారం తెలిపారు. తనపై నమ్మకంతో పార్టీ పదవి వచ్చేందుకు బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.



హెల్పింగ్ హ్యాండ్స్ గదిలో కాకుండా బయట పారవేసిన దుస్తులు

## లక్ష్యం మంచిదే.. ఆచరణ లోపం

**డోన్:** సామాజిక సేవ చేయడంలో చిత్తశుద్ధి లోపిస్తే ఆయా సంస్థలు ప్రజల నుంచి విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తుంది. పట్టణంలోని పాత ఆంధ్రబ్యాంక్ ఎదురుగా ఫ్లైఓవర్ కింద రోటరీక్లబ్ పార్కు నిర్వహణ కోసం మున్సిపాలిటీ ద్వారా స్థలం పొంది మొదట మొక్కలు సంరక్షించేందుకు శ్రద్ధ చూపింది. కాలక్రమేణా విస్మరించడంతో పార్కు స్థలం అన్యాక్రాంతమైంది. ఇక్కడే యాచకులు, అనాథలు, అభాగ్యుల కోసం దుస్తులు సేకరించి నిల్వ ఉంచేందుకు హెల్పింగ్ హ్యాండ్స్ సెంటర్ అనే గదిని ఏర్పాటు చేశారు. అనంతరం దుస్తులను బయట పారవేసి గదికి తాళం వేశారు. దీంతో అక్కడ దుస్తులు చెత్త, చెదారం, దుమ్ము, ధూళితో పేరుకుపోవడమే కాక దుస్తులపై కుక్కలు, పందులు నిద్రిస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. పార్కు, హెల్పింగ్ హ్యాండ్స్ గది నిర్వహణను సక్రమంగా నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.

## బాధిత రైతులకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న ఆవాజ్ కమిటీ నాయకులు

**ప్యాపిలి:** జలదుర్గం పరిధిలోని గొల్లపల్లి బుగ్గ వద్ద ఏర్పాటు చేస్తున్న సోలార్ ప్రాజెక్టు కారణంగా నష్టపోతున్న రైతులకు న్యాయం చేయాలని సీపీఎం నాయకులు చిన్న రహిమాన్, ఆవాజ్ కమిటీ నాయకుడు రసూల్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రైతులకు ఆధారమైన భూములను తీసుకుంటే సదరు కంపెనీ రైతులకు సంవత్సరానికి ఎకరాకు రూ. 40 వేలు చొప్పున కౌలు చెల్లించాలన్నారు. లేదా 2013 చట్టం ప్రకారం భూములు కోల్పోతున్న రైతులకు నష్ట పరిహారం చెల్లించాలన్నారు. సోలార్ ప్రాజెక్టులో రైతుల కుటుంబాలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. రైతులను బలవంతంగా భూముల నుంచి వెళ్లగొడితే ఆందోళన చేయాల్సి వస్తుందన్నారు. సమావేశంలో ఖాశీం, ఖాజా, కిట్టు, హుసేన్‌బాషా, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

### వ్యక్తి ఆత్మహత్య



చంద్రమోహన్ (ఫైల్)

**డోన్:** పట్టణంలోని తారక రామనగర్ కాలనీకి చెందిన వి.చంద్రమోహన్(42) మనస్తాపానికి గురై ఆదివారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడని రైల్వే జీఆర్‌పీ ఎస్‌ఐ బిందు మాధవి తెలిపారు. రైల్వే స్టేషన్‌లోని 4వ ప్లాట్‌ఫాంలో పడివున్న మృతదేహాన్ని రైల్వే సిబ్బంది గుర్తించి సమాచారం ఇవ్వడంతో పరిశీలించామని తెలిపారు. విచారణలో మృతుడు చంద్రమోహన్ అని తెలిసిందన్నారు. ఒక ప్రైవేటు కంపెనీలో రిప్రజెంటివ్‌గా పనిచేసేవాడని, కుటుంబంలో తరచూ గొడవలు జరుగుతుండడంతో మనస్తాపానికి గురై గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుని భార్య సౌజన్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. మృతదేహాన్ని డోన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు.

## •భక్తిశ్రద్ధలతో ఉరుసు



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఎంపీపీ, ముస్లింలు

**బేతంచెర్ల:** స్థానిక అంగళ్ల బజారు సమీపంలో సయ్యద్ మహమ్మద్ దివాన్ షా ఖాద్రి ఉరుసును ఆదివారం వైభవంగా నిర్వహించారు. దర్గా పీఠాధిపతులు హల్తాఫ్ హుస్సేన్ సాహెబ్, నిషార్ సాహెబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గా నిర్వాహకుల ఆహ్వానం మేరకు ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ, స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ మాజీ డైరక్టర్లు ముర్తుజావలి, ఖాజా హుసేన్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రుడు, పట్టణ, మండల కన్వీనర్లు తిరుమలేశ్వర్ రెడ్డి, జాకీర్ హుసేన్ తదితరులు దర్గాలో పతేహాలు సమర్పించారు.



స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎంపీపీ, భక్తులు

## కనుల పండువగా వేంకటేశ్వరుని కల్యాణం

**బేతంచెర్ల:** పట్టణంలోని దుర్గాపేటలో వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయ 12వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని భూదేవి, శ్రీదేవి సమేత స్వామివారి కల్యాణాన్ని ఆదివారం కనులపండువగా నిర్వహించారు. రిటైర్డు ఎస్‌ఐ మద్దయ్య కుటుంబ సభ్యులు, కాలనీ వాసుల ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి అభిషేకాలు, కుంకుమార్చన, మహా మంగళహారతి, ఉత్సవ సంప్రోక్షణల అనంతరం 11 గంటలకు మంగళవాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణ నడుమ స్వామివారి కల్యాణం శాస్త్రోక్తంగా జరిగింది. కాలనీవాసుల ఆహ్వానం మేరకు ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి హాజరయ్యారు. నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, గోరుమానుకొండ సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లు ఆలయ అభివృద్ధికి రూ. 10 వేలు విరాళం అందజేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులను పురవీధుల మీదుగా ఊరేగించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు బుగ్గన చంద్రమౌళిశ్వర్ రెడ్డి, సమరసత సేవా ఫౌండేషన్ డివిజన్ కన్వీనర్ నాగమోహన్‌రెడ్డి, సభ్యులు రమణ, గూని నాగరాజు, ఆంజనేయులు, మాజీ ఎంపీపీ గజ్జి కిట్టమ్మ, తిరుమలేశ్వర్‌రెడ్డి, ఎద్దులన్న తదితరులు పాల్గొన్నారు.

### వెంకటయ్యకు నివాళి



సమాధి వద్ద నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

**బేతంచెర్ల:** బేతంచెర్ల లారీ మోటర్ వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపకుడు కామ్రేడ్ వెంకటయ్య వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆయన సమాధి వద్ద కార్మిక సంఘం నాయకులు నివాళులర్పించారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో వెంకటయ్య చిత్రపటానికి ఆ సంఘం నాయకులు ఎల్లయ్య, సాధిక్ హుసేన్, వైటీ వెంకటేశ్వర్లు, రామాంజనేయులు పూలమాలలు వేశారు. ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఏడుగురికి గాయాలు



ప్రమాదానికి కారణమైన ఆటో

**కొలిమిగుండ్ల:** స్థానిక జమ్మలమడుగు రోడ్డులోని ప్రధాన రహదారిపై ఆదివారం ఆటో, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఏడుగురు గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి.. నందిపాడుకు చెందిన లోకనాథ్‌రెడ్డి, రాజాగోవిందు పని నిమిత్తం బైక్‌పై కొలిమిగుండ్లకు బయలు దేరారు. రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీలో పని చేసే ఇతర రాష్ట్రాల కార్మికులు కొలిమిగుండ్లలో కూరగాయాలు, నిత్యావసర సరుకులు కొనుగోలు చేసి ఆటోలో ఫ్యాక్టరీకి బయలు దేరారు. మార్గమధ్యలో వేప్రిడ్జి సమీపంలోకి వెళ్లగానే ముందు వెళుతున్న లారీని ఆటో ఓవర్‌టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నందిపాడుకు చెందిన ఇద్దరికి తీవ్రగాయాలు కాగా ఆటో డ్రైవర్ భూపాల్, రామ్‌కో కార్మికులు స్వల్పగాయాలతో బయట పడ్డారు. ఆటో డ్రైవర్ టేప్ రికార్డులో పాటలు పెట్టుకొని వేగంగా డ్రైవ్ చేస్తు లారీని ఓవర్‌టేక్ చేస్తుండగా ప్రమాదం చోటు చేసుకుందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ప్రమాద విషయం తెలుసుకున్న సీఐ రమేష్‌బాబు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని 108లో తాడిపత్రికి, మిగిలిన వారిని స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.



పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

## సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**ప్యాపిలి:** ఏనుగుమర్రి ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో కలుసుకున్నారు. 2002–03 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు 22 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో పాఠశాలలో సందడి వాతావరణం నెలకొంది. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు బాలకృష్ణుడు, సర్వజ్ఞమూర్తి, మౌలాలి, రమేశ్, విజయలక్ష్మి, రాధ, ముజద్ అలీ తదితరులను ఘనంగా సత్కరించారు. తమతో పాటు చదివిన ఓ మిత్రుడి ఆరోగ్యం క్షీణించిందని తెలుసుకుని రూ. 50 వేలు ఆర్థికసాయం చేయాలని నిర్ణయించుకున్నారు. పాఠశాల అభివృద్ధికి రూ. 20 వేలు విరాళంగా ఇస్తున్నట్లు తెలిపారు.



కొలిమిగుండ్ల: గురువులతో అంకిరెడ్డిపల్లె ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు,



బేతంచెర్ల: ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు



నందివర్గం జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**కొలిమిగుండ్ల:** అంకిరెడ్డిపల్లె ఉన్నత పాఠశాలలో ఆదివారం 2000–01 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని జరుపుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన నాటి గురువులను ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు 25 ఏళ్ల తర్వాత ఒకచోట కలుసుకోవడంతో ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కనకాద్రిపల్లెకు చెందిన సహచర పూర్వ విద్యార్థి కుళ్లాయప్ప పక్షవాతానికి గురికావడంతో తమ వంతుగా రూ.7500 ఆర్థిక సాయం అందించారు.

### పూర్వవిద్యార్థుల కలయిక

**బేతంచెర్ల:** పట్టణంలోని సరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో 2004–05 పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకుని నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. హెచ్‌ఎం తిరుమలేష్ గౌడు, పూర్వపు ఉపాధ్యాయులు రామ మద్దిలేటి, సుబ్రమణ్యశర్మ, సుజాత, అలివేలమ్మ, జక్రియాలను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు సునీల్, ఉపేంద్ర, అరుణ్, మధులోకేశ్వరెడ్డి, నిరంజన్, విజయ్, సురేంద్ర, సుజిత్, మాధవి, ప్రసన్న, స్వాతి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### గుర్తుకొస్తున్నాయి..

**బనగానపల్లె:** మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2004–2005 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. పూర్వ హెచ్‌ఎం ఐవీ పక్కీరారెడ్డి, కుమార్‌బాబు, సావిత్రమ్మ, సుబ్బారెడ్డి, కృష్ణమూర్తి, సుబ్బయ్య, రేణుకాదేవిని సన్మానించారు. పూర్వ విద్యార్థులు పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు నరేంద్రయాదవ్, నరేంద్ర అశోక్‌రెడ్డి, దీనేష్ కుమార్, మాదవ, దీపిక, శైలజ, జయభారతీ తదితరులు పాల్గొన్నారు. పాఠశాల వద్ద బస్సు షెల్టర్ నిర్మాణానికి పూర్వ విద్యార్థులు హామీ ఇచ్చారు.

### అ'పూర్వ' కలయిక



ఒకే వేదికపై చేరిన పూర్వ విద్యార్థులు

**కోవెలకుంట్ల:** పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. పాఠశాలలో 2004–05 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఒక వేదికపై చేరారు. వీరంతా వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగాలు చేస్తూ స్థిరపడ్డారు. సమ్మేళనంతో వారంతా ఒకచోట చేరి అప్పటి జ్ఞాపకాలు, మధుర స్మృతులు, అల్లరి చేష్టలను గుర్తు చేసుకున్నారు. అనంతరం తమకు విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు రాజయ్య, రాఘవాచారి, నాగశేషు, శేషారెడ్డి, సుమతి, సరోజ, నారాయణరెడ్డి ప్రత్యేకంగా ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులు రంగస్వామి, మనోహర్, సాలెంరాజు, కిరణ్, అక్బర్, దస్తగిరి, సురేంద్ర చౌదరి కార్యక్రమ కో–ఆర్డినేటర్లుగా వ్యవహరించారు.